క్లుప్తంగా

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



కొడవటిపూడిలో సాగు పద్ధతులను వివరిస్తున్న శాస్త్రవేత్త శ్రీధర్

కోటవురట్ల: సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధ్యమని జాతీయ మత్స్య పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త యు.శ్రీధర్ తెలిపారు. మండలంలోని కొడవటిపూడి గ్రామంలో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. శాస్త్రవేత్త శ్రీధర్ మాట్లాడుతూ వరిలో అధిక దిగుబడుల కోసం వ్యవసాయ శాఖ సూచనలు తీసుకోవాలన్నారు. డ్రోన్ ద్వారా రసాయనాల పిచికారీ సులభమని, తద్వారా ఖర్చు, సమయం ఆదా అవుతాయన్నారు. సమగ్ర కలుపు యాజమాన్య పద్ధతులను పాటించడం వల్ల కూలీల కొరతను అధిగమించవచ్చని తెలిపారు. శాస్త్రవేత్తలు ప్రసాదరావు, శ్రీకాంత్ గౌడ్, మధుసూదనరావు, వ్యవసాయాధికారి బి.సరోజిని, సర్పంచ్ కోసూరు అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా కొత్త మహాలక్ష్మి పండగ



కొత్తమహాలక్ష్మి పండగ ఊరేగింపు

మునగపాక: కొత్తమహాలక్ష్మి అమ్మవారి పండగను మునగపాకలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. పూరిటిగెడ్డ కొత్తమహాలక్ష్మి సంఘ సభ్యులంతా ఊరేగింపుగా డప్పువాయిద్యాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పరిసర ప్రాంతానికి చెందిన భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా సంఘ సభ్యులు తగు చర్యలు తీసుకున్నారు.

ఏకాగ్రతతో చదివితే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎస్ఎంసీ చైర్మన్ జోగినాయుడు

మునగపాక: విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని పాటిపల్లి మోడల్ స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ బి.జోగినాయుడు తెలిపారు. మోడల్ స్కూల్ విద్యార్థులకు గురువారం ఆయన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రలో భాగంగా పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇష్టపడి, కష్టపడి చదువుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు అందుబాటులో ఉంటాయన్నారు. పిల్లలు చదువుపై దృష్టి సారించాలన్నారు. ప్రిన్సిపాల్ శ్రీ లక్ష్మి,ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రావెల్ ట్రాక్టర్ పట్టివేత



పోలీసులు పట్టుకున్న గ్రావెల్ ట్రాక్టర్

నక్కపల్లి: మండలంలో అమలాపురం నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్‌ను నక్కపల్లి పోలీసులు గురువారం పట్టుకున్నారు. అమలాపురం పరిసర ప్రాంతాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్‌ను తవ్వి తరలిస్తున్నట్లు అందినన సమాచారం మేరకు దాడులు చేసి వేంపాడు వద్ద ట్రాక్టర్‌ను పట్టుకున్నట్టు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. పెనాల్టీ తదుపరి చర్యల కోసం తహసీల్దార్‌కు తెలికామన్నారు.

ముగిసిన రైతుల అవగాహన సదస్సులు

ఎస్.రాయవరం: వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా రైతుల అవగాహన సదస్సులు గురువారంతో ముగిశాయి. పెద ఉప్పలం, గుడివాడ గ్రామాల్లో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సహకారంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొబ్బరిలో తెల్లదోమ సమస్యకు రైతులందరూ సామూహికంగా చర్యలు చేపట్టాలని రాజమండ్రి వాణిజ్య పంటల పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత డాక్టర్ కె. ప్రభాకర్‌రావు సూచించారు. సర్పంచ్‌లు దూళి శ్రీనుబాబు, కోశెట్టి వెంకటరమణ, రైతులు అచ్చుతరామరాజు, శ్రీధర్ పాల్గొన్నారు.

తొలి రోజు అంతంతే..



వేంపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిరు కానుకలు ఇస్తూ ఆహ్వానం పలుకుతున్న ఉపాధ్యాయులు



పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న దృశ్యం

- అందని విద్యా మిత్ర కిట్లు
- పునః ప్రారంభమైన పాఠశాలలు
- సగం మంది విద్యార్థులు గైర్హాజరు
- పుస్తకాల సరఫరాకే పరిమితం

నక్కపల్లి: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. యథా రాజా తథ ప్రజ అన్నట్టు కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ పాత రోజులు గుర్తుకువచ్చాయి. తొలిరోజు హాజరు అంతంత మాత్రంగానే ఉంది. సగానికి పైగా విద్యార్థులు పాఠశాలలకు హాజరు కాలేదు. పాఠశాలలు పునః ప్రారంభం నాటికే పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు పేరు మార్చి అందజేస్తామని ప్రకటించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లు విద్యార్థులకు అందలేదు. ప్రారంభం రోజున పలు పాఠశాలల్లో కూటమి నేతలు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యామిత్ర కిట్లలో సామగ్రి అరకొరగా పాఠశాలలకు చేరాయి. విద్యార్థులకు అందించాల్సిన కిట్‌లో మూడు జతల యూనిఫాం, రెండు జతల సాక్సులు, ఒక జత బూట్లు, స్కూలు బ్యాగు, బెల్టు ఉండాలి. అయితే కొన్ని పాఠశాలల్లో బెల్టులు, సాక్సులు రాగా, మరికొన్ని పాఠశాలకు బ్యాగులు మాత్రమే వచ్చాయి. యూనిఫాం మాత్రం ఎక్కడా రాలేదు. అనకాపల్లి జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రానికి అక్కడ నుంచి పాఠశాలలకు సరఫరా కావాల్సి ఉంది. పాఠశాలలు పునః ప్రారంభం నాటికే విద్యార్థులకు ఇవ్వాల్సిన స్టేషనరీ విద్యా మిత్ర కిట్లు సిద్ధం చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

అప్పుడు విమర్శలు.. ఇప్పుడు తల్లికి వందనం నగదులో కోత

పాఠశాల ప్రారంభం రోజునే తల్లికి వందనం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున జమ చేస్తామని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఏడాది గడిచిపోయింది. మొదటి సంవత్సరం తల్లికి వందనం పథకాన్ని ఎగ్గొట్టింది. రెండో ఏడాది పాఠశాలలు తెరిచే నాటికి తల్లికి వందనం నగదు జమ చేస్తారని ఆశపడ్డ తల్లిదండ్రులకు నిరాశే ఎదురైంది. ఈ పథకం కింద రూ.15 వేలు చెల్లిస్తామని ప్రకటించిన ప్రభుత్వం తాజాగా ఈ మొత్తం నుంచి రూ.2 వేలు కోత విధించి రూ.13 వేలు మాత్రమే జమ చేస్తామని ప్రకటించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం పాఠశాల నిర్వహణ నిమిత్తం వెయ్యి రూపాయలు కోత విధిస్తే తీవ్ర స్థాయిలో విమర్శలు చేసిన టీడీపీ, జనసేన పార్టీలు ఇప్పుడు తల్లికి వందనం కింద ఇచ్చే మొత్తంలో రూ.2 వేలు కోత విధిస్తున్నారని, దీనికి ఏం సమాధానం చెప్తారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. తల్లికి వందనం పథకానికి అర్హత సాధించిన విద్యార్థుల జాబితా అనర్హుల జాబితాలు సచివాలయాల్లో ప్రకటిస్తామని, అభ్యంతరాలు సరిచేసిన తర్వాత జూలై 5వ తేదీన లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకానికి అర్హత కింద పలు నిబంధనలు విధించడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. కుటుంబంలో ఫోర్ వీలర్ ఉండకూడదని, 300 మించి విద్యుత్ వాడకం ఉండకూడదని, మూడెకరాల దాటి మాగాణి పొలం ఉండకూడదంటూ నిబంధనలు విధించారంటూ ప్రచారం జరగడం పట్ల తమ పిల్లల పేర్లు అర్హుల జాబితాలో ఉంటాయో లేదోనన్న బెంగపట్టుకుంది. గత ప్రభుత్వంలో ముందుగానే ప్రకటించిన సంక్షేమ క్యాలెండర్ ప్రకారం పాఠశాలల తెరిచే నాటికే పుస్తకాలు, జగనన్న విద్యా కానుక కిట్లు, అమ్మవడి వంటి పథకాలు అందజేశారని, కూటమి ప్రభుత్వం మాత్రం ఈ పథకాలు అమలు చేయడంతో తీవ్రమైన తాత్సారం చేస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



వచ్చిన విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం

తొలి రోజు సగానికి పైగా విద్యార్థులు పాఠశాలకు హాజరు కాలేదు. నక్కపల్లి మండలంలో మొత్తం 75 పాఠశాలల్లో (ప్రైవేటు స్కూల్స్ కలిపి) 7,384 మంది విద్యార్థులకు గాను తొలి రోజు గురువారం 1,936 మంది మాత్రమే హాజరయ్యారు. పాయకరావుపేట మండలంలో 66 పాఠశాలల్లో 4,562 మంది విద్యార్థులకు గాను 1,070 మంది మాత్రమే హాజరయ్యారు. తొలిరోజు పాఠశాలకు హాజరైన విద్యార్థులకు ఉపాధ్యాయులు స్నేహ పూర్వక వాతావరణంలో స్వాగతం పలికారు. చిరు కానుకలు ఇచ్చి వారిని తరగతి గదుల్లోకి తోడ్కొని వెళ్లారు. హాజరైన విద్యార్థులకు డొక్కా సీతమ్మ పథకం కింద సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

అధ్వానంగా ఇందిరమ్మ కాలనీ ప్రధాన రహదారి



మునగపాక ఇందిరమ్మ కాలనీ ప్రధాన రహదారి

మునగపాక: స్థానిక ఇందిరమ్మ కాలనీ ప్రధాన రహదారి అధ్వానంగా దర్శనమిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రహదారి బురదమయంగా మారింది. దీంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. ఇందిరమ్మ కాలనీ ఏర్పాటు చేసి సంవత్సరాలు కావస్తున్నా ప్రధాన రహదారి అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో ఈ మార్గంలో ప్రయాణం సాగించే వాహన చోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. ఏ కొద్ది పాటి వర్షం కురిసినా రహదారి బురదమయంగా కనిపిస్తుందని స్థానికులు వాపోతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అచ్యుతాపురం రూరల్: మండలంలో 15 గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వెదురువాడ, గొర్లి ధర్మవరం, లంక ధర్మవరం, మట్ట ధర్మవరం, మార్టూరు రోడ్, దిబ్బపాలెం, భోగాపురం రోడ్, అచ్యుతాపురం, మోసయ్యపేట బర్మా కాలనీ, మోసయ్యపేట, పోడపల్లి, రామన్నపాలెం, కొత్తూరు మోసయ్యపేట, వెంకటాపురం కూడలి, అచ్యుతాపురం ఇందిరమ్మ కాలనీ గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం



సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న దృశ్యం



సామూహిక అక్షరాభ్యాసంలో పిల్లలు

మునగపాక: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సామూహిక అక్షరాభ్యాసం ఘనంగా నిర్వహించారు. పాఠశాలల పునః ప్రారంభంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అధికారులు ఈ కార్యక్రమం నిర్వహించారు. దీంతో పలువురు తల్లులు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు తమ పిల్లలను తీసుకువచ్చి అక్షరాభ్యాసం చేయించారు. మునగపాక అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ సారధ్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు టి.సరస్వతి, బి.రేవతీ పద్మ, శివ గణేషమ్మ, ఉమాదేవి, సత్యవతి, మంగతల్లి, లక్ష్మి, హేమలత పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించండి

యలమంచిలి రూరల్: అంగన్‌వాడీ (పూర్వ ప్రాథమిక పాఠశాల) కేంద్రాల్లో మూడేళ్లు నిండిన పిల్లల్ని చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.సుహాసిని తల్లిదండ్రులను కోరారు. యలమంచిలి మండలం రుక్మిణీపురం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పిల్లలు, వారి తల్లిదండ్రులు, బంధువులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల సామాజిక ఎదుగుదలకు ప్రభ



చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్



వేంపాడు సెక్టార్ పరిధిలో సామూహిక అక్షరాభ్యాసాలు

అచ్యుతాపురం రూరల్: మండలంలో వెదురువాడ అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ అపరంజని, సర్పంచ్ కొయ్యి శ్రీనివాస్ పాల్గొని పిల్లలతో అక్షరాలు దిద్దించారు. అంగన్‌వాడీ కార్యకర్త పద్మ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలో పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. నక్కపల్లి, వేంపాడు సెక్టార్ పరిధి కేంద్రాల్లో పండితులతో ప్రత్యేక పూజలు నిర్వహించి చిన్నారులతో అక్షరాభ్యాస కార్యక్రమాలు చేయించారు. నక్కపల్లి, నెల్లిపూడి, వేంపాడు తదితర కేంద్రాల్లో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. నక్కపల్లిలో సర్పంచ్ నేతల జయరత్నకుమారి, ఉప సర్పంచ్ వీసం రాజు, వేంపాడులో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మణిరాజు, సర్పంచ్ సురేష్‌రాజు, అప్పలరాజు, సీడీపీవో శ్రీవిద్య, సూపర్‌వైజర్లు లలిత, సత్యవతి పాల్గొన్నారు.



చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు ఆహ్వానిస్తున్న దృశ్యం

దైవ చింతన అలవరుచుకోవాలి



నరసింహమూర్తిని సత్కరిస్తున్న వాడ్రాపల్లి గ్రామస్తులు

మునగపాక: ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవరుచుకోవాలని హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రచార కర్త బుద్ద నరసింహమూర్తి కోరారు. వాడ్రాపల్లి పెదరామాలయంలో నెల రోజులుగా నిర్వహించిన రామాయణ ప్రవచనాల ముగింపు సందర్భంగా బుధవారం రాత్రి నరసింహమూర్తిని గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ మనిషి ధర్మంలో నడవడానికి ఆధ్యాత్మిక కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. పిల్లలు, పెద్దలు అవకాశం ఉన్న సమయంలో కొంతసేపైనా దేవాలయాలను సందర్శించాలన్నారు. పెద్దలు పెతకంశెట్టి రామజోగినాయుడు, మళ్ల వరహా నరసింగరావు, కొయిలాడ దశావతారం, పి.సత్యనారాయణ, మళ్ల శేషు, మళ్ల అప్పలనాయుడు, మళ్ల కన్నుంనాయుడు, కొణతాల శివరామకృష్ణ, మళ్ల రమణమ్మ, పీలా మాధవి, కొయిలాడ రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా మరిడి మాలక్ష్మమ్మ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న గ్రామ నాయకులు, పెద్దలు

అచ్యుతాపురం రూరల్: ఉప్పవరంలో మరిడి మాలక్ష్మమ్మ పండగ గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం భజనలు, చిడతలు, తప్పెటగుళ్లు, వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో అత్యంత వైభవంగా పుర వీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కూనిశెట్టి సత్తిబాబు, మాజీ సర్పంచ్ చిన్ని సత్యారావు, అడపా మాలక్ష్మినాయుడు, కాయల నాగేశ్వరావు, చిన్ని రమణ, గంగిరెడ్డి వెంకటేష్ పాల్గొన్నారు.

బాల కార్మికులు లేని సమాజమే లక్ష్యం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక: బాల కార్మికులు లేని సమాజం ఏర్పాటు కావాలని ఎస్ఐ పి.ప్రసాదరావు కోరారు. అంతర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవంలో భాగంగా క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి మళ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో ప్రభుత్వాలు అమలు చేయడం ద్వారా బాల కార్మిక వ్యవస్థను రూపుమాపవచ్చన్నారు. స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఎంఈవో-2 బుద్ద శివనాయుడు, జనసేన పార్టీ నేత టిక్కలి పరశురామ్, ప్రణతి స్కూల్ ప్రిన్సిపాల్ ఆడారి సతీష్, సీఆర్పీ గోవింద పాల్గొన్నారు.

డ్రగ్స్ వద్దు స్కిల్స్ ముద్దు



డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న ప్రగడ రాజు

అచ్యుతాపురం రూరల్: ఈగల్ టీం అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు స్కిల్స్ ముద్దు అనే నినాదంతో యువ నాయకుడు ప్రగడ రాజు గురువారం దుప్పితూరులో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కాకూడదన్నారు. అనంతరం ఉపాధి హామీ కార్మికులకు అల్పాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో బద్ది తాతాజీ, దేశంశెట్టి ఎల్లయ్యనాయుడు, ప్రగడ కొండలరావు, ప్రగడ చిన కొండలరావు, సత్తిబాబు, దేశంశెట్టి కాసుబాబు, శెట్టి గణేష్, శెట్టి సత్తిబాబు, బీ ఈశ్వరరావు, ప్రగడ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని నిరసన



సీఐటీయూ నాయకుల నిరసన

అచ్యుతాపురం రూరల్: యోగాంధ్ర కాదు, కార్మికులు, నిర్వాసితులు, మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. కార్మికులు రోజూ చేస్తున్న వ్యాయామమే ఎక్కువని, వారికి యోగాతో పనిలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను హరించే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి మరింత శ్రమను దోపిడీ చేసే విధంగా చట్టాలు మారుస్తుందన్నారు. పని గంటలు పెరిగి మానసిక ప్రశాంతత లేని వారికి యోగా ఏమి పనిచేస్తుందన్నారు. సమస్యలను పక్కదారి పట్టించడానికే సెజ్‌లో యోగా కార్యక్రమం నిర్వహించారన్నారు. కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు వెనక్కి తీసుకోవాలన్నారు. లేకుంటే కార్మికులందరూ పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కర్రి నాయుడు, ఆర్.సత్తిబాబు, అప్పారావు, కార్మికులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణచేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా జరిపారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.

ఘనంగా వినాయక ఆలయ వార్షికోత్సవం



గణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: స్థానిక వెంకటనగర్ కాలనీలో సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఆలయంలో మండపారాధన, గణపతి హోమం తదితర కార్యక్రమాలను వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. వెంకటనగర్, రాజీవ్‌నగర్, అప్పలపాయకరావుపేట, తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

గంగాలమ్మ తల్లి గుడికి విరాళాలు



గంగాలమ్మ తల్లి గుడికి విరాళం అందజేస్తున్న రామకృష్ణ దంపతులు

మునగపాక: మండలంలోని మూలపేటలో గంగాలమ్మ తల్లి గుడి అభివృద్ధికి పలువురు దాతలు తమవంతు సాయం అందజేస్తున్నారు. మునగపాకకు చెందిన వెలగా రామునాయుడు జ్ఞాపకార్థంగా కుమారుడు రామకృష్ణ, గౌరీ దంపతులు గురువారం రూ.5,116 విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన బొయిదాపు వాసు, లక్ష్మణరావు, నూకరత్నం దంపతులు రూ.5 వేల వంతున విరాళం అందజేశారు. సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, గాంధీ, ఆడారి నాయుడు, యల్లపు నాగేశ్వరరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

నర్సీపట్నం: వచ్చేనెల 9న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి పిలుపునిచ్చారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన కమిటీ జనరల్ బాడీ సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీల 42 రోజుల సమ్మె కాలంలో ప్రభుత్వం చేసిన ఒప్పందాలు ప్రకారం వేతనాల పెంపు, ఉద్యోగ విరమణ, మినీ టీచర్ల ప్రమోషన్లు అమలు చేయాలన్నారు. రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలన్నారు. పేదలకు ఉపయోగ పడే ఐసీడీఎస్‌కు తగిన నిధులు కేటాయింపు చేయాలన్నారు. ఈ సమస్యలపై జరుగుతున్న సమ్మెను విజయవంతం చేయాలన్నారు.